విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 09, మే 2025

జర్నలిస్టులపై వేధింపులను ప్రభుత్వం ఆపాలి

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : పత్రికా రంగాన్ని అణచివేసే విధంగా జర్నలిస్టులపై వేధింపులను ప్రభుత్వం ఆపాలని మండల జర్నలిస్టులు డిమాండ్ చేశారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిపై ఎలాంటి అనుమతులు, సెర్చ్ వారెంట్ లేకుండా పోలీసులు దాడి చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. గురువారం మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో మండల విలేకరులు తహసీల్దార్ బాలీశ్వర్ రెడ్డికి దాడిని ఖండిస్తూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల నాయకులు మాట్లాడుతూ ఫోర్త్ ఎస్టేట్‌గా పిలవబడే పత్రిక స్వేచ్ఛను కూటమి ప్రభుత్వం అణచివేస్తుందన్నారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిలోకి పోలీసులు అక్రమంగా ప్రవేశించి ఇంటిలోని వారిని భయభ్రాంతులకు గురిచేసి వస్తువులను ధ్వంసం చేయడం ప్రజాస్వామ్యానికి పత్రిక రంగానికి మాయని మచ్చ అన్నారు. చట్టాలను కాపాడవలిసిన పోలీసులే చట్టం విరుద్ధంగా వ్యవహరించడం సబబు కాదన్నారు. ప్రభుత్వానికి ప్రజల మధ్య వారిదిగా ఉండే జర్నలిస్టులను అణిచివేయడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులపై పెట్టిన కేసులను ఎత్తివేసి స్వేచ్ఛ సమానత్వాలకు ప్రతికలైన పత్రికారంగానే కాపాడాలన్నారు. ఎడిటర్ ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించిన పోలీసులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఈసీ సభ్యులు కుమ్మెత శేఖర్ రెడ్డి , మండల అధ్యక్షులు నవీన్ కుమార్ సూర్య, నాగేంద్ర, సీనియర్ జర్నలిస్టులు పక్కిరయ్య, పి.శేఖర్ బాబు, వెంకటేశ్వర రెడ్డి, సురేష్ లింగాధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్‌ల వేతనాల పెంపుకు మంత్రి కృషి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 1050 మంది గెస్ట్ లెక్చరర్లు నెల వారీ రూ.10 వేలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని నంద్యాల ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్, గెస్ట్ లెక్చరర్ల బృందం, ఆంధ్ర ప్రదేశ్ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ నాయకులు గెస్ట్ లెక్చరర్ల వేతనాలు పెంచాలని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫారూఖ్‌కు కొన్నిరోజుల క్రితం వినతి పత్రం అందజేశారు. మంత్రి ఫరూక్ స్పందించి ఈ సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి గెస్ట్ లెక్చరర్ల వేతనాలు రూ.10 వేల నుండి రూ.27వేలు పెంచుతూ ప్రభుత్వం నుండి ఆదేశాలు జారీ చేయించారు. తమ అసోసియేషన్ చేసిన విన్నపం మేరకు గెస్ట్ లెక్చరర్ల వేతనాలు పెంచుటకు కృషి చేసిన మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫారూఖ్‌కు గెస్ట్ లెక్చరర్లు, ఆంధ్ర ప్రదేశ్ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ తరుపున అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ సి. అబ్దుల్ అజీజ్ ధన్యవాదాలు గురువారం తెలిపారు. మైనారిటీ సంక్షేమం కోసం కొరకు, మైనారిటీస్ విద్యా పరంగా, ముఖ్యంగా మైనర్ మీడియా ఉర్దూ భాష అభివృద్ధికి, ఉర్దూ విద్యార్థులకు గుణాత్మకం విద్యా అందించటకు రాష్ట్ర మంత్రి ఫారూఖ్ చేస్తున్న కృషి అభినందనీయమని అబ్దుల్ అజీజ్ తెలుపారు. అసోసియేషన్ నాయకులు షమీమ్ భాను, షోయబుజ్జమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో కార్యాలయానికి చేరుకున్న పుస్తకాలు

విశాలాంధ్ర- ఉయ్యాలవాడ : మండలంలోని పాఠశాలలకు 6,589 పుస్తకాలు ఎంఈవో కార్యాలయానికి చేరుకున్నట్లు మండల విద్యాశాఖ అధికారి వీర ప్రతాపరెడ్డి గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ఈపుస్తకాలను పాఠశాల తెరిచిన వెంటనే వారికి అందజేస్తామని ఆయన తెలిపారు.

అత్యుత్తమ సేవలకు పురస్కారం

గవర్నర్ అవార్డు, గోల్డ్ మెడల్‌ను పొందిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రెడ్ క్రాస్ అభివృద్ధికి విశేష సేవలు అందించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా గవర్నర్ అవార్డును పొందారు. గురువారం అమరావతిలోని రాజ్ భవన్‌లో జరిగిన ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం, ప్రపంచ తలసేమియా దినోత్సవ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఎస్.అబ్దుల్ నజీర్, ప్రథమ మహిళ సమీరా నజీర్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గవర్నర్ అవార్డు, గోల్డ్ మెడల్‌ను స్వీకరించారు. రాష్ట్రంలో రెడ్ క్రాస్ ఉద్యమానికి అత్యుత్తమ సేవలు అందించడంతో పాటు, గరిష్ట సహకారాన్ని సమీకరించినందుకు 8మంది కలెక్టర్లకు గవర్నర్ పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ఇటీవల అధునాతన వసతులతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌ను ప్రారంభించుకున్నామన్నారు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ప్రజలకు అత్యంత తక్కువ ధరలకు లభ్యమయ్యేలా జనరిక్ మెడికల్ షాప్‌ను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. యూత్ రెడ్ క్రాస్‌ను బలోపేతం చేసి అత్యవసర పరిస్థితుల్లో సేవలందించేలా రెడ్ క్రాస్ ఆర్మీనీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తయారు చేస్తామన్నారు. మత్స్యకారులకు, చెంచు కుటుంబాలకు కూడా రెడ్ క్రాస్ సంస్థ ద్వారా మరిన్ని వైద్య సేవలు ఇంటింటికి అందించేందుకుచర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడి రామారావు, కోశాధికారి రామచంద్రరాజు, జనరల్ సెక్రెటరీ ఏకే ఫరీద, నంద్యాల చైర్మన్ దస్తగిరి పర్ల తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ళ నిర్మాణాలకు అదనపు సాయం

విశాలాంధ్ర - చాగలమర్రి : అసంపూర్తిగా ఉన్న ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నదని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలియజేసారు. గురువారం పట్టణంలోని కుంచిపురి ఎరుకలి కాలనీలోని ప్రభుత్వ గృహాల లబ్దిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ లే అవుట్లలో అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం బిసి,ఎస్సీలకు రూ.50 వేలు,ఎస్టీలకు రూ.75వేలు,చెంచులకు లక్ష రూపాయలు అదనపు ఆర్థిక సహాయాన్ని ముంజూరు చేసిందన్నారు. లబ్దిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గృహ నిర్మాణాలు పూర్తి చేసి తమ సొంత ఇంటి కలను నెరవేర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి మనోజ్,హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్ ఓబులేసు, ఇంజనీరింగ్ సహాయకులు కృష్ణనాయక్, కోటి, నరేష్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

విశాలాంధ్ర - బనగానపల్లె : విద్యార్థుల పుస్తక పఠనాని అలవర్చు కోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాష్ తెలిపారు. గురువారం శాఖ గ్రంథాలయం నందు సమ్మర్ ఓరెంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా స్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు విశ్రాంత ప్రధాన ఉపాధ్యా యులు శ్రీరాములు విశ్రాంత గణిత ఉపాధ్యాయులు జీఎం నాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు బోధించారు. ఈ కార్యక్ర మాన్ని గ్రంథాలయ అధికారి బషీర్ అహ్మద్ నిర్వహించాడు. గ్రంథాల య పాఠకులు, బిడిసి ఆర్గనైజర్ విజయ భాస్కర్ రెడ్డి, యాగంటయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

కామినేని పల్లెలో భూ రీసర్వే ప్రారంభం

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని కామినేని పల్లె గ్రామంలో భూ రిసర్వ్ ప్రారంభం అయినట్లు తాసిల్దార్ పుష్పకుమారి పేర్కొన్నారు. ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుల కింద భూముల రీ సర్వే నిమిత్తం ఎంపిక చేసిన గ్రామాలలో రెవెన్యూ, సర్వే అధికారులు ర్యాలీ నిర్వహించి గ్రామసభలు ఏర్పాటు చేసి భూ సర్వే వల్ల భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని మండల సర్వేయర్ చిన్న మల్లయ్య పేర్కొన్నారు. కామినేని పల్లె గ్రామంలో భూ రీసర్వేపై మండల సర్వేయర్ చిన్న మల్లయ్య అధ్యక్షతన ర్యాలీ నిర్వహించి అవగాహన కార్యక్రమాన్ని కల్పించారు. రీ సర్వే వల్ల దీర్ఘకాలికంగా ఉన్న రైతుల యొక్క భూ సమస్యలకు చెక్ పెట్టవచ్చని సర్వేలోని లోటుపాట్లను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ భూ సర్వేతో రైతులకు మేలు చేకూరుతుందని రైతుల సమక్షంలో సర్వే రాళ్లు పాతడం జరుగుతుందన్నారు. సర్పంచ్ మెరువ చిన్న నరసింహారెడ్డి, విఆర్ఓ రసూల్ సచివాలయాల సర్వేయర్లు, ఇతర అధికారులు ,సిబ్బంది, మాజీ సర్పంచ్ సిరిగిరి రాంభూపాల్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బ్రదర్ లక్కా అనిల్ కుమార్, రెవెన్యూ సిబ్బంది గ్రామానికి చెందిన ప్రముఖ భూస్వాములు చిన్న సన్నకారు రైతులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్ చేస్తే కఠిన చర్యలు : ఈవో

విశాలాంధ్ర-బనగానపల్లె : అక్రమ మైనింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈవో బ్రహ్మానంద రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని పలుకూరు గ్రామంలో శివుని మాన్యం భూముల్లో సర్వేనెంబర్ 308అక్రమ మైనింగ్ చేస్తున్నారన ఫిర్యాదు మేరకు మైనింగ్ ప్రాంతాన్ని ఈవో బ్రహ్మానంద రెడ్డి పరిశీలించినట్లు తెలిపారు. వచ్చేసరికి మైనింగ్ చేస్తున్న వ్యక్తులు పారిపోయినట్లు తెలిపారు. దేవుని మాన్యం భూముల్లో అక్రమ మైనింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాటు సారా, మద్యం బాటిళ్లు స్వాధీనం

విశాలాంధ్ర- బనగానపల్లె: మండల వ్యాప్తంగా గురువారం పలుచోట్ల దాడులు నిర్వహించి నాటు సారా, మద్యం బాటిల్ స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైంజ్ సీఐ వర్ధన దేవి తెలిపారు. పట్టణంలో మనీ పేట నాగలక్ష్మమ్మ, మల్లికార్జున వద్ద నుండి 10లీటర్ల నాటుసారా, నందవరం గ్రామంలో పాణ్యం చెన్నకేశవరెడ్డి, పనకార బాల వెంకటేశ్వర్లు వద్ద నుండి కర్ణాటక మద్యం హైవే డీలక్స్ విస్కీ 48 టెట్రా ప్యాకెట్ 180 ఎమ్ఎల్ , అమృత సిల్వర్ కప్ బ్రాందీ 750 ఎమ్ఎల్ , 12 బాటిల్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

కార్మిక సంఘాలు పిలుపు..

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్ : కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్టియూ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.నాగరాజు, ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేస్తూ,కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రైవేటీకరణ ఆపి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ రద్దు చేయాలన్న డిమాండ్ల కోసం కేంద్ర కార్మిక సంఘాల మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త సమ్మె జయప్రదం కోసం ఈనెల నంద్యాల జిల్లా కేంద్రంలో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 16, 17 తేదీల్లో స్కూటర్, ఆటో ర్యాలీలు పాదయాత్రలు, 20వ తేదీన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం కోసం జిల్లాలో అన్ని మండల, నియోజకవర్గ కేంద్రాల్లో కార్మిక ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు, ఉద్యోగులు విధులు బహిష్కరించి భారీగా ప్రదర్శనలు, సమ్మెను ఉధృతంగా తమ హక్కుల సాధన కోసం కార్మికులు ఐక్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్, ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘ నాయకులు రంజిత్, శివరాముడు, మస్తాన్, ఈశ్వరమ్మ, స్బుబ్బమ్మ సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, అనుబంధ సంఘ నాయకులు గౌస్ మద్దులు, ఐఎఫ్టియు నాయకులు చౌడప్పలు పాల్గొన్నారు.

మున్సిపల్ అవిశ్వాసంలో
నెగ్గిన బైరెడ్డి వర్గం

చైర్మన్‌గా దాసి సుధాకర్ రెడ్డి
భారీ బందోబస్తుతో జేసీ ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మాన సమావేశం

విశాలాంధ్ర - నందికొట్కూరు : నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డిపై ఎమ్మెల్యే వర్గం కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం తీర్మానం కోరం లేకపోవడంతో ఎంపీ బైరెడ్డి శబరి వర్గమైన దాసి సుధాకర్ రెడ్డికి చైర్మన్ పదవి మళ్లీ లభించింది. గురువారం నందికొట్కూరు మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం సమావేశం ప్రత్యేక అధికారి నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, ప్రొసిడింగ్ ఆఫీసర్ ఆత్మకూరు ఆర్డీఓ నాగ జ్యోతి నిర్వహించారు. ఉదయం 11గంటలకు చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. అనంతరం ఉదయం 11.25 నిమిషాలకు ఎమ్మెల్యే గిత్త జయసూర్య తన వర్గం కౌన్సిలర్లు 15మందిని వెంట తీసుకోని సమావేశానికి హాజరయ్యారు. ఎంపీ వర్గంలోని కౌన్సిలర్ హమీద్ మియ్య ఎమ్మెల్యే వర్గానికి మద్దతుగా హాజరయ్యారు. చైర్మన్‌తో కలుపుకొని 17మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం సమావేశానికి హాజరయ్యారు. సమావేశం జరుపడానికి 20మంది కోరం కావాల్సి ఉండగా 17మంది కౌన్సిలర్లు ఉండడంతో ఈ సమావేశం 30నిముషాలు వాయిదా వేస్తూ ఆర్డీఓ ప్రకటించింది. కోరంకు కావలసిన సభ్యులు ఎమ్మెల్యే వర్గానికి ఇద్దరు అవసరం వచ్చింది, అయితే 30నిముషాలు సమయం ఇచ్చినప్పటికీ సభ్యులు ఇద్దరు హాజరు కాకపోవడంతో దీనితో అవిశ్వాస తీర్మానం వీగిపోయిందని ఆర్డీఓ సమావేశాన్ని అందరి సమ్మతితో ముగించారు. దీంతో మళ్లీ చైర్మన్‌గా దాసి సుధాకర్ రెడ్డికి వరించింది. సమావేశం నుంచి బయటకు వచ్చిన చైర్మన్ సుధాకర్ రెడ్డి మీడియాతో మున్సిపాలిటీని దోచుకోవడానికే ఎమ్మెల్యే వర్గం అవిశ్వాసం పెట్టారని, అవినీతి అధికారులను ఎవరిని కూడా వదలమన్నారు. అవిశ్వాసంలో నాకు సహకరించిన కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. నందికొట్కూరు మున్సిపాలిటీనీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో ఎంపీ బైరెడ్డి శబరి సహకారంతో ప్రజలకు అందుబాటులో ఉండి మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. చైర్మన్‌పై అవిశ్వాసం సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో 144సెక్షన్ అమలు చేశారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ ఆధ్వర్యంలో పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, రూరల్ సీఐ సుబ్రమణ్యం, ఆత్మకూరు సీఐ సురేష్ కుమార్ రెడ్డిలు గట్టి బందోబస్త్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు తహసీల్దార్ శ్రీనివాసులు, కమీషనర్ బేబీ, మేనేజర్ సుహాలత, ఆర్వో మధుసూదన్ బాబు, ఎసైలు చంద్రశేఖర్, ఓబులేసు, తిరుపాలు, సురేష్, నారాయణ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎగువ అహోబిలంలో ఘనంగా కళ్యాణోత్సవం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన ఎగువ అహోబిలంలో వైశాఖ మాస నరసింహ జయంతి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా గురువారం శ్రీదేవి, భూదేవి సమేత జ్వాల నరసింహ స్వామికి నవ కలశ తిరుమంజనం నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల ఆచార్యులు ఆధ్వర్యంలో వాసంతిక పరిణయోత్సవం (తిరు కల్యాణోత్సవం) వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులైన జ్వాల నరసింహ స్వామి, చెంచులక్ష్మి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ఎదుర్కోల కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు పూలమాలలను తలపై ఉంచుకొని చేస్తున్న నృత్యం చూపరులను ఆకట్టుకుంది. అనంతరం ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా కళ్యాణ మండపానికి తీసుకొని వచ్చి కళ్యాణం నిర్వహించారు. సాంప్రదాయం ప్రకారం జ్వాల నరసింహస్వామి చెంచులక్ష్మి అమ్మవార్ల కళ్యాణోత్సవానికి ఆళ్లగడ్డ శాసన సభ్యురాలు భూమా అఖిలప్రియ పట్టు వస్త్రాలను సమర్పించారు.కళ్యాణానికి వచ్చిన చెంచు మహిళలకు చెంచు కులంలో ఉన్న వారికి మరియు భక్తులకు వస్త్రాలు ఇచ్చారు. ఈ వసంతిక పరిణయోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ట్రాక్టర్, కారు ఢీ.. వ్యక్తి మృతి

విశాలాంధ్ర- రుద్రవరం : మండలంలోని నరసాపురం గ్రామ సమీపంలో ట్రాక్టర్, కారు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో రంగ సుబ్బరాయుడు (70)మృతి చెందినట్లు ఎస్సై వరప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు బుధవారం రాత్రి అహోబిలం గ్రామానికి చెందిన రంగ సుబ్బరాయుడు కారులో ఆళ్లగడ్డకు వెళ్లి ఇంటికి తిరిగి వెళుతున్న క్రమంలో నరసాపురం సమీపంలోని రవి కాలేజీ దగ్గర అహోబిలం వైపు నుంచి వరిగడ్డి కట్టలు వేసుకొని వస్తున్న ట్రాక్టర్ ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న రంగ సుబ్బరాయుడుకి తీవ్ర గాయాలు అయ్యాయన్నారు. దీంతో ఆయనను చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుండి పొద్దుటూరుకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సైతెలిపారు.

13న జిల్లా స్థాయి చెస్ పోటీలు

11 ఏళ్లలోపు బాల, బాలికలకు ప్రత్యేక విభాగాల్లో

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఆంధ్ర చెస్ అసోసియేషన్ నిర్వహించబోయే రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక కోసం నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు శ్రీ రామకృష్ణ విద్యాలయ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో జిల్లా స్థాయి 11 సంవత్సరముల లోపు బాల, బాలికలకు వేరు వేరు విభాగాలలో చెస్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, కార్యదర్శి రామ సుబ్బారెడ్డి, ఎస్వీ డిగ్రీ కళాశాల, సిఎంఎస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మునిశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12వ తేదీ సాయంత్రం 6 గంటల లోపు ఏపీ చెస్ వెబ్ సైట్ లో ఎంట్రీలు నమోదు చేసుకోవాలని, నంద్యాల జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 24, 25వ తేదీల్లో గుంటూరులో జరగబోవు రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు నెంబర్ 9010451585 ను సంప్రదించాలన్నారు.

పిడుగుపాటుకు నాలుగు గేదెలు మృతి

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని మీర్జాపురం గ్రామంలో కలం దొడ్డిలో పిడుగు పడి నాలుగు గేదెలు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. బుధవారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షం గ్రామంలో కురిసింది. గ్రామానికి చెందిన మొట్టే వెంకటకృష్ణ ఇంటి ఆవరణంలో ఉన్న పశువుల పాకలో నాలుగు గేదెలను ఉంచాడు.వర్షంపడుతున్న సమయలో అర్ధరాత్రి భారీ పిడుగు పశువులపాకపై పడడంతో అక్కడికక్కడే 4 గేదెలు మృతి చెందాయి. ఒక్కసారిగా పిడుగు పడి నాలుగు గేదెలు మృతి చెందడంతో బాధిత రైతు వెంకట కృష్ణ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. గేదెల మీద ఆధారపడి వెంకటకృష్ణ కుటుంబం జీవనోపాధి పొందుతున్నది. నాలుగు గేదెల విలువ దాదాపు రూ.2 లక్షల వరకు విలువ చేసే నాలుగు గేదేలను కోల్పోయిన వెంకటకృష్ణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

మోస్తారు వర్షం : మండల వ్యాప్తంగా బుధవారం అర్ధరాత్రి మోస్తారు వర్షం కురిసింది. ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షం ఆయా గ్రామాలలో పడింది. ఈదురుగాలుల దాటికి మండల వ్యాప్తంగా 16 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కొలిమిగుండ్ల నుండి మీర్జాపురం గ్రామానికి వెళ్లే విద్యుత్తు లైన్‌కు సంబంధించి నాలుగు స్తంభాలు, కొలిమిగుండ్ల,పెట్నికోట తదితర గ్రామాల పరిధిలో విద్యుత్ స్తంభాలు నేలకులాయి. నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను విద్యుత్ అధికారులు తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేసి విద్యుత్తు సరఫరా ను పునరుద్ధరించారు.

20న దేశవ్యాప్త జాతీయ కార్మిక సమ్మెను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : మే 20న దేశవ్యాప్త జాతీయ కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చిన మేరకు రాష్ట్రంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మున్సిపల్ సమ్మె నోటీసును గురువారం ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌కు రమేష్ బాబుకు అందజేశారు. సిపిఐ తాలూకా కార్యదర్శి టీ.ప్రతాప్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ మే 20న సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : వరల్డ్ రెడ్ క్రాస్ డే సందర్భంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం పండ్లు, బ్రెడ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా డిసిహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, మేనేజింగ్ కమిటీ సభ్యులు ఉస్మాన్ భాష, మండల చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, రెడ్ క్రాస్ సభ్యులు శీను డిఎఫ్ఓ అబ్దుల్ సమీ తదితరులు పాల్గొన్నారు. ముందుగా రెడ్ క్రాస్ ఫౌండర్ జాన్ హెన్రీ దున్యాంట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిసిహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా మాట్లాడుతూ ఆపత్కాల సమయంలో అన్నివేళలా ముందుండేది రెడ్ క్రాస్ సొసైటీ అని పేర్కొన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా అధ్వర్యంలో బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ప్రారంభించడం జరిగిందని తెలిపారు. పేదలకు సేవ చేయడం శుభ పరిణామమని, రెడ్ క్రాస్ సేవలను అభినందించారు.

వైభవంగా వాసవి మాత కుంభాభిషేకం

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి దేవాలయం నిర్వహించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన వజ్రోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా బీసీ ఇందిరమ్మ, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు, టిడిపి వాణిజ్య విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి సీనయ్య హాజరయ్యారు. గురువారం బీసీ ఇందిరమ్మ, టంగుటూరి సీనయ్య కోవెలకుంట్లకు చేరుకోగా పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పెండేకంటి సుబ్రహ్మణ్యం దంపతులు, యువజన సంఘం నాయకుడు కర్నాటికి అభిలాష్, ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం బీసీ ఇందిరమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గం ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో ఉండేలా చూడాలని వాసవి మాతను వేడుకున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం యువజన సంఘ నాయకుడు కర్నాటి అభిలాష్ టిడిపికి చేసిన సేవలను గుర్తించి అభినందించి శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు, సోదరీమణులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ బ్రోచర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఈనెల 15వ తేదీన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ పుట్టినరోజు సందర్భంగా నంద్యాల 33వ వార్డు టిడిపి ఇంచార్జ్ జోసఫ్, సాయి, మధు ధనరాజ్, చాంద్ ఆధ్వర్యంలో 9వ తేదీ నుండి స్థానిక ఎస్పిజి గ్రౌండ్ నందు ఎస్ పిఎల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని, దానికి సంబంధించిన బ్రోచర్‌ను గురువారం నంద్యాల టీడీపీ కార్యాలయం నందు టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ ఎస్.పిఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో మొదటి బహుమతి రూ.60వేలు, రెండవ బహుమతి రూ.40వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎంట్రీ ఫీజు రూ.1000, బాల్ ఫీజు 100 చెల్లించవలసి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు 8వ తేదీ సాయంత్రంలోపు తమ టీం పేర్లను 8919507340, 9701159958కి ఫోన్ చేసి నమోదు చేసుకోవాల్సిందిగా తెలిపారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 09, మే 2025

ఈ నెల 20 సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కర్నూలు: ఈ నెల 20 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ను విజయవంతం చేయాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూదోట ప్రకాష్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్పకోరారు. గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వ జన వైద్యశాలలో జరిగిన సమావేశంలో పిలుపుని చ్చారు. ఈ సందర్భంగా పోతోట ప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వా సుపత్రిలోనూ, డిస్పెన్సరీస్‌లోనూ, పీహెచ్‌సీ సెంటర్లో పని చేస్తున్న శానిటేషన్ సెక్యూరిటీ బెస్ట్ కంట్రోల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత కాంట్రాక్ట్ అగ్రిమెంట్లు కాల పరిమితి దాటి సంవత్సరం కావస్తున్నా టెండర్ల నిర్వహిం చినప్పటికీ కొత్త ఏజెన్సీలు రాకపోవడం వలన కార్మికులు వేల రూపాయలు నష్ట పోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కొత్త ఏజెన్సీల కు కార్మికులను అప్పగించి కొత్త వేతనాలు అమలు చేయాలని, ప్రతి నెల జీతాలు చెల్లించే ఏజెన్సీలకే కాంట్రాక్ట్ ఇవ్వాలని గతంలో కార్మిక కార్మికుల జీతాలు సరిగా చెల్లించకుండా కనీస వేతనాలు అమలు చేయకుండా పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయని ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ కర్నూలు నగర ఉప ప్రధాన కార్యదర్శి టి.రామాంజనేయులు, జిల్లా మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు రాష్ట్ర కార్యదర్శి వి.ప్రణీత్, జీజీహెచ్ యూనియన్ నాయకులు ఎం.రాజు, బి.నాగశేషులు బాలరాజు, సురేషు, శివ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బయో మైనింగ్ త్వరితగతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : గార్గేయపురం డంప్‌యార్డులో ప్రారంభమైన బయో మైనింగ్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు ఆదేశించారు. గురువారం డంప్‌యార్డంలో బయోమైనింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో బయో మైనింగ్ ద్వారా చెత్త శుద్ధి చేసే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. డంప్ యార్డులో నిల్వ ఉన్న దాదాపు 65 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను రానున్న మూడు నెలల్లోపు బయో మైనింగ్ ప్రక్రియ ద్వారా శుద్దీకరణ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ట్రామెల్ యంత్రాన్ని వినియోగించుకొని చెత్తను నాలుగు పద్ధతుల్లో ప్రాసెసింగ్ చేస్తారని, ప్లాస్టిక్, ఇనుము, గాజు వస్తువులు, రాళ్లు రప్పలను వేర్వేరు చేయడం జరుగుతుందన్నారు. కాగా అంతకన్నా ముందు కమిషనర్ సెట్కూర్ కార్యాలయం వద్దనున్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. మెనూ, టోకెన్‌ల సంఖ్య, శుభ్రత అంశాలపై ఆరా తీశారు. నిర్వహణకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకోరావాలని నిర్వాహకులకు కమిషనర్ సూచించారు. కొత్త బస్టాండ్, గుత్తి పెట్రోల్ బంక్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, డిఈఈ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు చెల్లించాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: సీపీఎస్ ఉద్యోగులకు కరువు భత్య బకాయిలు చెల్లించకుండా ఆదాయ పన్ను మినహాయించడం దేశంలో ఎక్కడాలేని విధంగా ఏపీలో జరగడం ఉద్యోగుల దౌర్భాగ్యం అని ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కమిటీ కన్వీనర్ వీరచంద్ర యాదవ్ అన్నారు. గురువారం ఏర్పడేషన్ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదాయపు పన్ను చెల్లించినా 60 నెలల కరువు భత్యం బకాయిలు, 2023లో గ్రీన్ ఛానల్లో ఉన్న 34 నెలల బకాయిలు చెల్లింపు ఊసే లేకపోవడం శోచనీయమన్నారు. ఉపాధ్యాయులు పదోన్నతులు, బదిలీలు పారదర్శకంగా చేయాలని, మున్సిపల్ హైస్కూల్స్‌లో మంజూరు అయిన హెడ్ మాస్టర్, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

అభయగిరి చిల్డ్రన్స్ హెూమ్ తనిఖీ

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి గురువారంకర్నూలు మిలటరీ కాలనీ నందుగల ఇన్ఫాన్ జీసస్ చిల్డ్రన్ హెూమ్‌ను తనిఖీ చేయడం జరిగింది. ఆశ్రమంలోని నిరాశ్రయులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆశ్రమంలోని రికార్డులును, పరిశుభ్రతను పరిశీలించారు. వారికీ అందుతున్న ఆహార, వైద్య సదుపాయల గురించి అడిగి తెలుసుకున్నారు. వారికీ ఏమైనా సమస్యలు వస్తే 15100టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేస్తే వెంటనే న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు.

మార్క్స్ మెమో నేటి నుంచి వెబ్‌సైట్‌లో..

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: పదో తరగతి మార్క్స్ మెమో సంబంధించిన www.bse.ap.gov.in వెబ్సైట్లో ఉంచామని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. సామ్యూల్ పాల్ గురువారం ఒక ప్రకటన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ లాగిన్ ఆధారాలు ఉపయోగించే సబ్జెక్ట్ వారిగా పనితీరు, మార్క్ లిస్ట్ డౌన్లోడ్ చేసుకొని, సంతకం కాపీలను విద్యార్థులకు అందజేయవచ్చని తెలిపారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయండి

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: లేబర్ కోడ్లను రద్దు చేయాలని, 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని 20 ప్రధాన డిమాండ్స్ తో కేంద్ర కార్మిక సంఘాలు ఈ నెల 20న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప తెలిపారు. అనంతరం సీపీఐ కార్యాలయంలో ఏఐటీ యూసీ తాలూకా కార్యదర్శి తిమ్మ గురుదు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి, కార్మిక హక్కులను కాపాడుకోవడానికి జరగబోయే దేశవ్యాప్త ఈ సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు వీరేష్, నాయకులు ఎల్లప్ప, నరసింహులు, నాగరాజు, రవి, సోమన్న పాల్గొన్నారు.

అత్యుత్తమ సేవలకు పురస్కారం

విశాలాంధ్ర - కర్నూలు: రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా రాష్ట్ర గవర్నర్ నుండి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాకు పురస్కారం లభించింది. 2023 -24, 2024-25 సంవత్సరాల్లో బాపట్ల, కర్నూలు జిల్లాల్లో రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా అత్యుత్తమ సేవలందించిన సందర్భంగా గురువారం విజయవాడ రాజ్ భవన్ లో జరిగిన కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏపీ స్టేట్ బ్రాంచ్ ప్రెసిడెంట్ శ్రీ అబ్దుల్ నజీర్ నుండి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా రెడ్ క్రాస్ అవార్డ్ అందుకున్నారు. రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా గడచిన రెండేళ్లలో కర్నూలు, బాపట్ల జిల్లాలలో చేపట్టిన సేవలను ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రశంసించారు. కర్నూలు, బాపట్ల జిల్లాల్లో రెడ్ క్రాస్ ద్వారా బ్లడ్ డొనేషన్ క్యాంపులు, ఆర్గాన్ డొనేషన్స్, మెడికల్ క్యాంపులు పల్స్ పోలియో, లెప్రసీ, ఎయిడ్స్ అవేర్నెస్ ర్యాలీలు, తదితర కార్యక్రమాలు నిర్వహించడాన్ని గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు.

ఉపాధి హామీ బకాయిలు వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర- ఆలూరు : హొళగుంద మండలంలోని ఉపాధి హామీలో నెలకొన్న బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్ కోరారు. గురువారం స్థానిక ఏపీఓ చక్రవర్తికి వ్యవసాయ కార్మిక ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. భూపేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీకి బడ్జెట్లో నిధులు కేటాయించాలని, మెటీరియల్ కంపోనెంట్ 50శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరించాలని, 200 రోజులు పని దినాలు కల్పించి, రోజు కూలీ రూ.700 మళ్లించరాదని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి రంగన్న మాట్లాడుతూ, ఈ నెల 9,10,11 తేదీల్లో ఉపాధి హామీ పని ప్రదేశాలను వ్యవసాయ కార్మిక సంఘం, ఏఐటీయూసీ నియోజవర్గ కేంద్రంలో మూడు రోజులపాటు ఆ జిల్లా నాయకత్వం ఉపాధి హామీ పని ప్రదేశాల్లో పనులు పరిశీలించి, ఉపాధి హామీ శ్రామికులు చెప్పిన మా దృష్టికి వచ్చిన సమస్యలపై ఈ నెల 12న కలెక్టర్‌కు ఉపాధి హామీ సమస్యలపై మెమొరండాలు సమర్పిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లింగప్ప, వీరేష్, ఆంజనేయ, బజారప్ప, రాము, మంజప్పా తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ హాస్టల్ మంజూరు చేయాలి

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: కటారు కొండ గ్రామంలో బీసీ సంక్షేమ బాలుర, బాలికల హాస్టల్‌ను మంజూరు చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రికి విజయవాడలో వినతి పత్రం అందించినట్లు మండల టీడీపీ అధ్యక్షులు మర్రి శ్రీరాములు తెలిపారు. గురువారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ కటారుకొండ జిల్లా పరిషత్ పాఠశాలకు బీసీ సంక్షేమ బాలుర, బాలికల హాస్టల్ కావాలని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్ బాబు చొరవతో బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితను కలిసి వినతి పత్రం అందించామన్నారు. క్రిష్ణగిరి మండలం వెనుకబడిన ప్రాంతంలో మారుమూలలో ఉందన్నారు. మండలంలో ఎక్కువగా వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారని ఆయన తెలిపారు. పిల్లలను చదివించుకోవాలంటే జీవనోపాధి లేదన్నారు. పిల్లలతో కలిసి కుటుంబాలు గుంటూరు, బళ్లారి, హైదరాబాదు, విజయవాడ తదితర ప్రాంతాలకు వలస వెళ్లి కూలిపనులకు వెళ్తున్నారు. బీసీ సంక్షేమ హాస్టల్ మంజూరు చేస్తే చుట్టుపక్కల గ్రామాల పిల్లల జీవితాలు బాగుపడతాయని తెలిపారు.

సాక్షి ఎడిటర్ ఇంట్లో సోదాలు.. పత్రికా స్వేచ్ఛపై దాడే

విశాలాంధ్ర - కర్నూలు : కార్డన్ సెర్చ్ పేరుతో సాక్షి దినపత్రిక సంపాదకుడు ఆర్. ధనంజయరెడ్డి ఇంటిలో తనిఖీలు చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమే అని ఐజేయూ జాతీయ సమితి సభ్యులు కె.నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎన్.వెంకట సుబ్బయ్య, జిల్లా గౌరవ సలహాదారులు, రాష్ట్ర సమితి సభ్యులు వైవీ క్రిష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఇ.ఎన్.రాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సుంకన్న, కోశాధికారి అంజి, రాష్ట్ర సమితి సభ్యులు మధు, జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, సహాయ కార్యదర్శులు శివరాజ్ కుమార్, అవినాష్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిరంజీవి, మధు గురువారం ఒక ప్రకటన ఖండించారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా విజయవాడలో సాక్షి సంపాదకుని ఇంటిలో పోలీసులు బలవంతంగా చొరబడి తనిఖీలు చేసిన ధోరణి దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. పాత్రికేయులను భయపెట్టడానికి మాత్రమే పోలీసులు ఇలాంటి చర్యలకు పూనుకుంటున్నట్లు తాము భావిస్తు న్నామని యూనియన్ నాయకులు ప్రకటనలో పేర్కొన్నారు. ఒక ప్రముఖ పత్రికా సంపాదకుని ఇంటిలో సోదాలు జరపాలని పోలీసులు భావించి ఉంటే ముందుగా నోటీసు ఇచ్చి ఉండాల్సిందని, పెద్ద సంఖ్యలో పోలీసులు ఇంటిలో చొరబడిన తీరు గర్హనీయమని యూనియన్ నాయకులు ఆక్షేపించారు. ప్రభుత్వ పెద్దలకు సాక్షి యాజమాన్యంపై ఉన్న రాజకీయ వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకుని పోలీసులు సాక్షి జర్నలిస్టులపై ఇలాంటి చర్యలు తీసుకుంటున్నట్లు భావించాల్సి వస్తున్నదని, ఇలాంటి ధోరణి భావ్యం కాదని, సాక్షి పాత్రికేయులపై అక్రమ కేసులు బనాయించడం, సంపాదకుని ఇంటిలో సోదాలు చేయడం పాత్రికేయులను భయభ్రాంతులకు గురి చేయడానికేనని యూనియన్ నాయకులు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల అత్యుత్సాహాన్ని నియంత్రించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే, ఐజేయూ నేతలు డిమాండ్ చేశారు.

ప్రమాదవశాత్తు నీటి కుంటలోపడి వ్యక్తి

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని రాళ్లదొడ్డి గ్రామంలో నివసించే బోయ రామకృష్ణ, బోయ అనసూయ దంపతుల కుమారుడు బోయ శ్రీను (14) ప్రమాదవశాత్తు నీటికుంటులో పడిలో పడి, మృతి చెందాడు.

నగలు స్వాధీనం.. దొంగకు దేహ శుద్ధి

విశాలాంధ్ర - సి.బెళగల్. నగలు స్వాధీనం చేసుకుని దొంగకు దేశ శుద్ధి చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. మండల కేంద్రంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని చూసి కొంతమందికి అనుమానం వచ్చి, పట్టుకోవాలని ప్రయత్నించడంతో అక్కడి నుండి పారిపోయే ప్రయత్నం చేయటంతో దొంగను పట్టుకుని దేహశుద్ధి చేశారు. అప్పటికే గంజాయి తీసుకుని ఉండడంతో స్పృహ తప్పి పడిపోయాడు. అతని నడుముకు చుట్టుకున్న చిన్న బ్యాగు తీసుకుని చూడగా విలువైన నగలు బయటపడ్డాయి. వెంటనే ఆ విషయాన్ని ఎస్సై పరమేష్ నాయక్‌కు సమాచారం ఇవ్వగా వాడిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు ఆ వ్యక్తి ఎవరని ఆరా తీయగా కోడుమూరుకు చెందిన అబ్దుల్ కలాం అని పోలీసులు కనుగొన్నారు. సుమారు 12 తులాల బంగారు నాలుగు తులాల వెండి ఉన్నట్లు గుర్తించారు. ఈ దొంగ ఇంకా ఎక్కడెక్కడ చోరీలకు పాల్పడుతున్నాడా, ఈ చోరీలన్నీ ఒక్కడే చేస్తున్నాడా, లేక ఏదైనా ముఠా ఉందా అన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

సిల్వర్ సెట్ ఈ నెల 15 వరకు పెంపు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు నిర్వహించే అర్హత పరీక్ష, సిల్వర్ సెట్ 2025 గడువును మే 15 వరకు పెంచుతున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ సెట్ అంటే ఎంతో ప్రతిష్టాత్మకమైన సెట్ అని, ఈ సెట్ గురించి చాలా మంది విద్యార్థులకు తెలియాలనే ఉద్దేశంతో గడువు పెంచామన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా చుట్టుపక్కల గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఎక్కువగా ఉన్నారని వారిని కూడా దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. సిల్వర్ సెట్ అర్హత పరీక్ష మే 29న నిర్వహిస్తున్నట్లు క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

విశాలాంధ్ర- గూడూరు: పట్టణంలోని రాజ వీధిలో తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. పట్టణానికి చెందిన సీఐటీయూ నాయకులు జె.మోహన్ తన కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం అనంతపురం జిల్లా యాడికి గ్రామంలో జరిగే ఓ శుభకార్యానికి వెళ్లారు. గురువారం మధ్యాహ్నం తిరిగి గూడూరుకు చేరుకుని ఇంటికి వెళ్లగా ఇంట్లోనా బీరువాలో బట్టలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బీరువలోని మూడు నర తులాలు బంగారు, పది తులాలు వెండి అపహరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు గూడూరు పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

ఎడిటర్ ఇంట్లో పోలీసులు సోదా చేయడం తప్పు

విశాలాంధ్ర-హొళగుంద: సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంట్లో పోలీసులు సోదా చేయడం తప్పు అని ఏపీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడు సీహెచ్ నాగరాజ్, గౌరవ అధ్యక్షుడు బీఎం అమీర్ సాబ్ తీవ్రంగా ఖండించారు. తహశీల్దార్ కార్యాలయం ముందు తాలూకా ఏపీయూడబ్ల్యూజే సంఘం నాయకులు హెచ్.విరుపాక్షి, కె.నాగప్ప, ఈ నాగరాజ్ గౌడ, మండల ఏపీయూడబ్ల్యూజే సంఘం కార్యదర్శి ఎం.రవికాంత్‌ల ఆధ్వర్యంలో గురువారం ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్ నాగరాజ్ మాట్లాడుతూ ధనుంజయ రెడ్డి ఇంటిలో పోలీసులు అక్రమంగా ప్రవేశించి ఎడిటర్ కుటుంబాన్ని మనోవేదనకు గురి చేశారని వాపోయారు. ముందస్తుగా ఎడిటర్‌కు పోలీసులు సమాచారం ఇచ్చి అనుమతి పొందిన తర్వాతే ఇంటిని చట్ట ప్రకారంగా సోదా చేయాల్సింది పోయి, అక్రమంగా పోలీసులు ఇంటిని ప్రవేశించడం పత్రికా రంగాన్ని అవమానించడం అని అన్నారు. జిల్లాలో అసాంఘిక కార్యములు పై జర్నలిస్టులు వార్తలు రాస్తే వారిపై అసాంఘిక శక్తులు దాడులు నిర్వహిస్తున్నారని పోలీసులు కేసులు బనాయించి జర్నలిస్టులను అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. జర్నలిస్టులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవికాంత్, ముధస్సర్, మహేష్, మహబూబ్ బాష, మంజునాథ్, విశ్వనాథ్, అబుబకర్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ ముకుందరావుకు ఏపీయూడబ్ల్యూజే సంఘం నాయకులు వినతి పత్రాన్ని సమర్పించారు.

పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలి

విశాలాంధ్ర - తుగ్గలి: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల ద్వారా రైతులు రూ.20 వేల ఆర్థిక సాయం పొందేందుకు రైతులు సంబంధిత రైతు సేవ కేంద్రంలో దరఖాస్తులు చేసుకోవాలని తహశీల్దార్ రమాదేవి, వ్యవసాయ అధికారి పవన్ కుమార్‌లు తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వో, ఏఈఓ, ఎంపీఈవోలు, సచివాలయం అగ్రికల్చర్ సహాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుండి అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కొరకు రైతులు ఆధార్ కార్డు, వన్ బీ, అడంగల్ జిరాక్స్ పత్రాలను సంబంధిత రైతు సేవా కేంద్రం నందు ఇచ్చి తమ పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు. కౌలుదారులు సంబంధిత రైతు సేవ కేంద్రాల్లో కౌలు రైతు కార్డులను పొందాలని తెలిపారు. త్వరలోనే కౌలు కార్డులపై సచివాలయాల్లో సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రైతులు అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంచాయతీ కాంట్రాక్ట బిల్ కలెక్టర్ మృతి

విశాలాంధ్ర - హొళగుంద: పోలగుంద మేజర్ పంచాయతీలో గత 20 నుండి కాంట్రా క్ట్ బేసిస్ కింద బిల్ కలెక్టర్‌గా పని చేస్తున్న పింజారి పీర్ సాబ్ అనారోగ్యంతో గురు వారం మృతి చెందినట్లు గ్రామ కార్యదర్శి బి.రాజశేఖర్ గౌడ తెలిపారు. మృతుడి మట్టి ఖర్చులకు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని సర్పంచ్ చేలువాది రంగమ్మ, గ్రామ కార్యదర్శి బి.రాజశేఖర్ గౌడ అందించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి రాజశేఖర్ గౌడ మాట్లాడుతూ మృతుడు పీర్ సాబ్ కాంట్రాక్ట్ బేసిక్ ద్వారా బిల్ కలెక్టర్‌గా పని చేస్తూ ప్రజా సేవలు చేశాడని, గ్రామాభివృద్ధికి తోడ్పడ్డాడని అన్నారు. మృతుడి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

సమ్మిళితంగా విజన్ ప్లాన్‌ను రూపొందించాలి

విశాలాంధ్ర - కర్నూలు: అభివృద్ధి, సంక్షేమ సమ్మిళితంగా విజన్ ప్లాన్‌ను రూపొందించాలని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్వర్ణాంధ్ర 2047లో భాగంగా కర్నూలు, నంద్యాల జిల్లాల విజన్ కార్యాచరణ ప్రణాళిక, నియోజకవర్గాల వారిగా విజన్ కార్యాచరణ ప్రణాళికలపై వర్క్‌షాప్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర ఏ 2047లో భాగంగా స్టేక్ హెూల్డర్‌లతో జిల్లా నుండి మండల స్థాయి వరకు సమావేశాలు నిర్వహించి మండల స్థాయిలో ఇన్పుట్ లు తీసుకొని , ఇంటి ఇంటి సర్వే చేసి జిల్లాకి సంబంధించిన 2047 డాక్యుమెంటేషన్ సిద్ధం చేసుకోవడం జరిగిందన్నారు. అదే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు స్టేట్ విజన్ డాక్యుమెంట్ ను కూడా లాంచ్ చేయడం జరిగిందన్నారు... కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ ప్లాన్ కి అనుసంధానంగా రాష్ట్ర స్థాయిలో స్వర్ణాంధ్ర ఏ 2047 డాక్యుమెంటేషన్ ను తయారు చేసుకోవడం జరిగిందన్నారు.. విజన్ ప్లాన్ ఉంటేనే అనుకున్న గమ్యాన్ని నిర్దేశించిన సమయానికి పూర్తి చేసేందుకు వీలవుతుందన్నారు.. సంవత్సరానికి 50 శాతం వృద్ధి సాధించే విధంగా ప్రైమరీ, సెకండరీ, టెర్రిటరీ సెక్టర్ లలో సామర్థ్యాన్ని అంచనా వేసుకొని మన జిల్లాలో ఉన్న రిసోర్స్ లను అంచనా వేసుకుని వేరు వేరు సెక్టార్ ల నుండి వచ్చే కాంట్రిబ్యూషన్ ని పెంచే విధంగా యాక్షన్ ప్లాన్ చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, సీపీఓ హిమ ప్రభాకర్ రాజు, కర్నూల్ ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీవో భరత్, నంద్యాల సిపిఓ వేణుగోపాల్, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు..

రైతులకు అందుబాటులో ఉండాలి

విశాలాంధ్ర - హొళగుంద: మండలంలోని రైతు వ్యవసాయ భూముల భూసార పరీక్షలను వీపిఏలు వ్యవసాయ సిబ్బంది చేయాలని మండల వ్యవసా యాధి కారి ఆనంద్ లోక్‌దళ్ కోరారు. మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో గురు వారం వీఏలు, ఎంపీఈవోలు, వీవోఏల సమావేశం జరిగింది. ఆనంద్ లోక్ దళ్ మాట్లాడుతూ గ్రామాల్లోని రైతుల భూముల్లో భూసార పరీక్షల శాంపులు కలెక్షన్ చేసి మండల వ్యవసాయాధికారి కార్యాలయానికి చేర్చాలని అలాగే అర్హులైన రైతులకు అన్నదాతసుఖీభవ నగదు అందడానికి జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. వ్యవసాయ సిబ్బంది అందరూ రైతులకు అందుబాటులో ఉండి ఎప్పటి సమస్యను అప్పటికే పరిష్కరిస్తే ఎలాంటి సమస్యలు రావని అన్నారు. అర్హులైన కౌలు రైతులను గుర్తించి ఆన్లైన్ చేయాలన్నారు. వీఏ విరుపాక్షి, ఎంపీఈవోలు నరసింహులు, ఉత్తరన్న, వీఏఏలు పార్వతి బాయ్, తస్లీమ్, మణిశ్రీ, మహేష్, మణికంఠ, కృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన వీరబ్రహ్మేంద్ర స్వామి మహెూత్సవం

విశాలాంధ్ర- క్రిష్ణగిరి: మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో వెలిసిన శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మహెూత్సవం గురువారం ముగిసిందని ఆలయ ధర్మకర్త వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ గత మూడు రోజుల నుండి బ్రహ్మయ్య స్వామి పూజలు ఉత్సవ ఊరేగింపు నందికోలా సేవ తదితర కార్యక్రమాలతో మహెూత్సవం జరిగిందన్నారు. పలుసాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడాపోటీలు, చెక్కభజన కార్యక్రమాలతో భక్తులు ప్రజలతో ఘనంగా జరిగినట్లు ఆయన తెలిపారు. న్యూ క్యాటగిరి బండలాగుడు పోటీల్లో హెూరాహెూరీగా తలబడిన వృషభ రాజుల విజేతలకు నగదును బహుమతులు గ్రామ పెద్దలు అందజేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన గ్రామ పెద్దలు, ప్రజలకు భక్తులకు దాతలకు నా ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

జంట హత్యల కేసులో యావజ్జీవ కారాగార శిక్ష

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: 2017 సంవత్సరం కాంగాటి లక్ష్మీనారాయణ రెడ్డి అలియాస్ చెరుకులపాడు నారాయణరెడ్డి బి. సాంబశివుడు జంట హత్య కేసులో 11 మందికి జీవిత యావజ్జీవ కారాగార శిక్షను జిల్లా కోర్టు తీర్పు వెల్లడించారు. అప్పటి పోలీస్ డిపార్ట్మెంట్ బాబా ఫక్రుద్దీన్ విచారణ చేసి కోర్టులో చార్జి దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో 11 బీసన్న గారి రామాంజనేయులు, కోతుల రామా నాయు డు, రామకృష్ణ, కె.బాలు, కె.చిన్న ఎల్లప్ప, కె.పెద్ద ఎల్లప్ప, జి.వెంకట రాముడు, జి.శీను, బీసన్న గారి రామాంజనేయులు, బీసన్న గారి పెద్ద బిసన్న మందికి జీవిత యావగార శిక్ష విధిస్తూ గురువారం ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ తరపున వెంకట్ రెడ్డి వాదించారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలో బుధ వారం రాత్రి వీచిన పెనుగాలులకు మండలంలోని గొట్లూరు, పెద్దబోధనం గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలవాలాయి. గత రాత్రి పట్టణంతో పాటు పలు గ్రామాల్లో భారీగా ఈదురుగాలులు వీచి, ఓ మోస్తారు వర్షం కురిసింది. గొట్లూరు, పెద్దబోధనం గ్రామాల్లో దాదాపు 4విద్యుత్ స్తంభాలు నేలవాలాయి. చాగలమర్రి పట్టణంలో దాదాపు మూడు గంటల పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి

విశాలాంధ్ర - పాములపాడు: ఆర్ఎల్, ఆర్‌సీ స్టేజీల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ డెవలప్మెంట్ అధికారి ఎంఎన్‌వీ రాజు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో చంద్ర చంద్రశేఖర్ అధ్యక్షతన హౌసింగ్ సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రత్యేక అధికారి రాజు పాల్గొని మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న హౌసింగ్ లేఔట్స్ నందు ఆర్ఎల్, ఆర్‌సీ స్టేజీల్లో ఉన్న వాటిని అన్నినింటిని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఇంచార్జీ శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.